ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 20 అక్టోబరు 2025

ఐక్యతతోనే లక్ష్యాల సాధన
● ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్ టీజీ వెంకటేశ్
● అట్టహాసంగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రశాఖ కార్యవర్గ ప్రమాణం
6
ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుకు వేళాయే
● 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్కాలర్‌షిప్ ● ఈనెల 25వ తేదీ వరకే గడువు



దివ్వెల.. దీపావళి

● అంతటా దీపావళి సందడి ● అప్రమత్తతతోనే ఆనందమయం ● బాణసంచా కొనుగోళ్ల కోలాహలం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

దివ్వెల వెలుగు జిలుగుల పండుగ దీపావళి. దీపకాంతులతో ఇంటిని అలంకరించి అందరూ ఆనందంగా జరుపుకునే శుభదినం. దీపావళి జీవితాల్లో వెలుగులు తెస్తుందని అందరి విశ్వాసం. చెడుపై మంచి గెలుపునకు ప్రతీకగా.. అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ దీపావళి. విజయపు వెలుగుల్ని అందరికీ పంచే వేడుక ఇది. జిల్లాలో సోమవారం నరక చతుర్ధి(దీపావళి)ని వైభవంగా జరుపుకునేందుకు చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా సిద్ధమయ్యారు. పట్టణాలు.. పల్లెల్లో దీపావళి సందడి నెలకొంది. సోమవారం మహాలక్ష్మీ పూజకు భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇళ్లు, వ్యాపార సంస్థలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించుకుంటున్నారు. మట్టి ప్రమిదల్లో నూనె దీపాలు వెలిగించి ఇళ్లను అలంకరించేందుకు మహిళలు సిద్ధమయ్యారు. మట్టి ప్రమిదలు.. బాణసంచా విక్రయాలకు ఎక్కడికక్కడ అధికారులు ఏర్పాట్లు చేశారు. బాణసంచా విక్రయాలకు అధికారులు ప్రత్యేకంగా లైసెన్సులు మంజూరు చేశారు. గ్రామాల్లో సైతం టపాకాయల దుకాణాలు నెలకొన్నాయి. ఆయా దుకాణాల వద్ద ఆదివారం సాయంత్రం నుంచి కొనుగోళ్ల సందడి నెలకొంది. బాణసంచా ధరలు అధికంగా ఉన్నాయని కొనుగోలుదారులు తెలిపారు.



బాణసంచా కొనుగోలు చేసిన చిన్నారులు



నరసరావుపేట డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

అప్రమత్తత అవసరం..

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దీపావళి పండుగలో టపాసులది ప్రధాన పాత్ర. రంగు రంగుల కాంతులతో కనువిందు చేస్తూ.. భారీ శబ్ధాలు చేసే టపాకాయలను కాల్చేంచేందుకు చిన్నారులతో పాటు పెద్దలు కూడా ఇష్టపడతారు. అయితే బాణసంచా కాల్చేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వినోదం కాస్తా విషాదంగా మారుతుంది. ఈ పరిస్థితుల్లో అప్రమత్తతతో దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రమాదాల నివారణకు బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు శాఖల వారీగా అధికారులు అవగాహన కల్పించారు.

టపాకాయలతో ప్రయోగాలొద్దు

టపాసులు కాల్చేటప్పుడు కొన్ని పేలకుండా ఆగిపోతాయి. అలాంటి వాటిని వెంటనే వెళ్లి పట్టుకోవడం వంటివి చేయకూడదు. వాటిని తిరిగి వెలిగించాలనే ప్రయత్నం చేయకూడదు. అలాంటి వాటిపై నీరు పోయడం మంచిది. తారాజువ్వలు, రాకెట్లు వంటి వాటి వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడైనా ప్రమాదం సంభవిస్తే 101, 100, 108 నెంబర్లకు సమాచారం అందించాలి.

కొనుగోళ్ల సందడి

అధికారికంగా, అనధికారికంగా పెద్దఎత్తున ఎక్కడికక్కడ బాణసంచా విక్రయ దుకాణాలు వెలిశాయి. ఆకాశం మేఘావృతమై ఉన్నా ఆదివారం సాయంత్రం నుంచి కొనుగోళ్ల సందడి నెలకొంది. టపాకాయల కొనుగోళ్లకు పిల్లలు పెద్దలతో తరలిరావడంతో పట్టణాల్లో కోలాహల వాతావరణం నెలకొన్నది. ఆదివారం శెలవు దినం కావడంతో ప్రజలు పూజాసామగ్రి కొనుగోళ్లకు ఉత్సాహం చూపారు. గృహాలను అలంకరించేందుకు ఉపయోగించే ప్రమిదలు రకరకాల రంగులతో పాటు వివిధ ఆకృతుల్లో ఆకర్షించేలా అందుబాటులో ఉంచడంతో వాటిని కొనుగోలు చేసేందుకు పలువురు ఆసక్తి చూపారు. ప్రమిదలతో పాటు కొవ్వొత్తులను కొనుగోళ్ళు చేశారు. ఇక దీపావళి పండుగకు పూజా సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. బంతిపూలు మూర రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయించారు.

ఆలయాలకు దీపాల శోభ

దీపావళి పండుగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ప్రధాన ఆలయాలతో పాటు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. విద్యుత్ వెలుగులతో ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. బుధవారం నుంచి కార్తీక మాసం ప్రారంభంతో దీపోత్సవాలకు ఆయా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి.

శబ్ద కాలుష్యం వల్ల వినికిడి లోపం



ప్రశ్న : శబ్దం వల్ల పోయే వినికిడి అనగా ఎమిటి ?

జవాబు : ప్రతి రోజూ మన దైనందిన చర్యలు భాగంగా ఎన్నో శబ్దాలు వింటాము-ఇంట్లో పెట్టే టి.వి, మిక్సీ, రేడియో, ట్రాఫిక్ ఇలా రకరకాల శబ్దాల మధ్యనే మన జీవనం ఉంటుంది, కాకపోతే ఎంత వరకు సేఫ్ ఎంత దాటితే ప్రమాదకరం అనేది తెలుసుకోవాలి. వినసొంపుగా లేని ఏ శబ్దం అయినా నాయిస్ అంటాము. అది మితి మీరితే నాయిస్ హజర్డ్ దాని వల్ల వినికిడి పోతుంది. ఇది 60% వరకు ప్రీవెంటబుల్ రాకుండా చేసుకోవచ్చు. సరైన అవగాహన లేకపోవడం వల్ల ఈ మధ్య యువత దీని భారిన పడుతున్నారు.

ప్రశ్న : శబ్దంని ఎలా కొలుస్తారు ! శబ్దం విన్న ప్రతి మనిషికి వినికిడి పోతుందా !

జవాబు : శబ్దంని డెసిబెల్స్ లో కొలుస్తాము. దీని వల్ల పోయే వినికిడి. రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి టెంపరరీ అనగా పెద్ద శబ్దం విన్నప్పుడు వినికిడి లోపం వచ్చి మళ్ళీ ఒకటికి లేదా రెండు రోజుల్లో వినికిడి వస్తుంది. ఉదా : దీపావళి టపాసులు, పెద్ద సైరన్‌లు. రెండోది పరిమినెంట్ అనగా వినికిడి లోపం మళ్ళీ వెనక్కి రాకపోవడం ఉదా : ఫ్యాక్టరీ వర్కర్స్, డిజె శబ్ధాలు, చెవిదగ్గర పేలిన టపాసులు. ఎంత డెసిబెల్స్ సౌండ్ వింటున్నాం అనే దానితో పాటు, ఎంతసేపు ఆ శబ్దంకి ఎక్స్‌పోజ్ అయ్యాము అనే దాని మీద ఆధారపడి ఉంటుంది.

ప్రశ్న : శబ్ద కాలుష్యం ఏ వయసు వాళ్ళకి ఎక్కువగా వస్తుంది ?

జవాబు : దీనికి వయసుతో సంబంధం లేదండి. అన్ని వయసుల వారికి ప్రమాదమే. రీసెంట్ స్టడీస్ ప్రకారం - 2050 సంవత్సరం నాటికి 2.5 బిలియన్ వినికిడి లోపం తో ఇబ్బంది పడతారు. అందులో 750 మిలియన్ మందికి రీహెబిలిటేషన్ సర్వీసెస్ అవసరం పడుతుందని **డబ్ల్యూహెచ్‌వో** చెబుతుంది. దీనికి కారణం మారుతున్న జీవనశైలి. 1 పెరుగుతున్న ఇయర్‌ఫోన్స్ వాడకం - జాబ్ పరంగా/ సాంగ్ పరంగా 2. ఇంటిలో పెరుగుతున్న టివిలు, హోమ్‌థియేటర్‌లు, స్పీకర్లు వాడకం. 3. పెరుగుతున్న ట్రాఫిక్. 4. డిజే/ పబ్ కల్చర్ పెరగడం ఇలా ఎన్నో రకాలుగా తరచూ శబ్దం వింటూనే ఉంటున్నాం.

ప్రశ్న : అసలు మన దైనందిన జీవితంలో వినే శబ్దాలు ఎంత డెసిబల్స్ ఉంటాయి!.

జవాబు : సాధారణ కన్వర్‌జేషన్ - 55-65డిబి, మూవీ థియేటర్ - 75-100డిబి **సౌండ్/ డెసిబెల్స్ పెరిగే కొద్ది, తక్కువ సమయంలోనే వినికిడి పోతుంది. ప్రతి 5డిబి సౌండ్ పెరిగే కొద్ది, మన సేఫ్ టైమ్ సగంకి పడిపోతుంది.** ఉదా : 85-90డిబి శబ్దం - ఎనిమిది గంటలు సేఫ్, 95 డిబి శబ్దం - రెండు గంటలు సేఫ్, 100 డిబి శబ్దం - రెండు గంటలు సేఫ్, 105 డిబి శబ్దం - గంట సేఫ్, 110 డిబి శబ్దం - అరగంట మాత్రమే సేఫ్, అంటే మ్యూజిక్ కాన్సర్ట్ / పబ్‌లో వినే శబ్దం కేవలం అరగంట మాత్రమే సేఫ్.

ప్రశ్న : శబ్దం వినకుండా ఉండటం అవ్వదు కదా ?

జవాబు : శబ్దం వినద్దు అనటం లేదు. మనం వింటున్న సౌండ్ సుమారుగా ఎంత డెసిబల్స్ ఉంటుంది అనేది తెలుసుకొని, అంత సేపు మాత్రమే ఎంజాయ్ చేయాలి. ఎప్పుడు ఇయర్ ఫోన్స్‌తో కంటిన్యూస్‌గా కాల్స్/ సాంగ్స్ వినే వాళ్ళకి **60-60 రూల్/ నియమం అనగా కేవలం 60 నిమిషాలు మాత్రమే ఇయర్ ఫోన్స్ వాడండి విత్ 60 % ఆఫ్ మీ మొబైల్ / ఇయర్ ఫోన్స్ వాల్యూమ్.**

ప్రశ్న : అసలు చెవి అనేది ఉన్నది సౌండ్ సెన్స్ చేయడానికి కదా ? మళ్ళీ ఎక్కువ శబ్దాలు వింటే అసలు చెవిలో మనకి ఏమి అవుతుంది?

జవాబు : మనకి వాసన, రుచి, చూపు, టచ్ అనే వాటి లాగా, హియరింగ్ కూడా సెన్స్ ఆర్గన్స్‌ని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఒక్కోసారి దెబ్బ తింటే పూర్తిగా వెనక్కి రాకపోవచ్చు. సౌండ్స్ అనేవి మన చెవిలో / గూబ/ ఇయర్ డ్రమ్ దగ్గర నుంచి వినికిడి ఎముకలు / ఓసిసెల్స్ అయిన మాల్యూస్ ఇన్స్‌కూస్, స్టేప్స్ దగ్గర నుంచి లోపల చెవిలో ఉన్న COCHLEA దగ్గరకి వెళ్తుంది. అక్కడ ఉన్న చిన్న వెంట్రుక లాంటి కణాలు అవుటర్ హెయిర్ సెల్స్ వైబ్రేట్ అయ్యి మెకానికల్ ఎనర్జీ అయిన సౌండ్‌ని ఎలక్ట్రికల్ ఎనర్జీ గా మారి నరాలు నుంచి సౌండ్‌ని మెదడుకు చేరుస్తుంది. పెద్ద శబ్దాలు విన్నప్పుడు, ఈ అవుటర్ హెయిర్ సెల్స్ అనేవి, వాటి స్థాయికి మించి వైబ్రేట్ అయితే డ్యామేజ్ అవుతాయి. ఇంకా ఎక్కువ అయితే డెత్ అయిపోతాయి. **ఇలా శబ్దం వలన వచ్చే వినికిడి లోపం ఈ అవుటర్ హెయిర్ సెల్ చుట్టూ తిరుగుతుంది.**

ప్రశ్న : ఫ్యాక్టరీస్ లో ఉండేవాళ్ళు ఎప్పుడు శబ్దాలు ఉంటూ వింటారు ? వాళ్ళకి మీరు ఏమి చేస్తారు ?

జవాబు : ఫ్యాక్టరీస్ లో ఉండేవారు సాధారణంగా 85డిబి పైన ఉంటుంది. అందుకే వాళ్ళ డ్యూటీ 6-8 గంటలు ఉంటుంది. ఇంకా ప్రొటెక్షన్ డివైజ్‌లాగా ఇయన్‌ఫోన్స్ / ఇయర్ మఫ్స్ వాడండి. మీ ఫ్యాక్టరీలో ఇవ్వకపోతే అడిగి తీసుకోండి. **ఫ్యాక్టరీస్ యాక్ట్ ప్రకారం మీకు ఆ శబ్దాలు వల్ల వినికిడి పోయినట్లు అయితే కాంపెన్‌సేషన్ మరియు వాళ్ళ రీహెబిలిటేషన్‌కి ఫ్యాక్టరీ బాధ్యత వహించాలి.**

ప్రశ్న : ఇలా వినికిడి పోతుంది అనే విషయం ముందుగా ఏమైనా తెలుసుకోగలమా ?

జవాబు : ఎక్కువగా శబ్దాలు / ఇయన్ ఫోన్స్ వాడే వాళ్ళకి చేవిలో మొత వస్తుంది, దాన్ని టినిటస్ అంటాం. అలా టినిటస్ చిన్నిగా ఉన్నప్పుడే దయచేసి గమనించి వినికిడి పోకముందే మీ దగ్గరలో ఉన్న ఇయన్‌టి డాక్టర్‌ని కలవండి.

ప్రశ్న : దీనికి ట్రీట్‌మెంట్ ఉంటుందా ?

జవాబు : ఇది 60-70% మనం శబ్ద కాలుష్యం ని తగ్గిస్తే రాదు స్టేజ్‌లో మీరు ఇయన్‌టి డాక్టర్‌ని కలిసినట్లు అయితే మీ చెవి, ఎండోస్కోప్ తో చూసి అడియోలజి టెస్ట్ అయిన ప్యూర్‌టోన్ ఆడియోమెట్రి, ఇంపడెన్స్ టెస్ట్ మరియు టినిటోగ్రామ్ లాంటివి చేస్తారు. వాటిలో వినికిడి ఎంత పోయింది. చెవిలో టినిటస్ వస్తుంటే దాని కారణం తెలుస్తుంది. **మన హస్పిటల్‌లో ఈ ఆడియోలజీ డిపార్ట్‌మెంట్ సపరేట్‌గా అంతర్జాతీయ సంస్థ అయిన ఎంప్లాయిన్‌తో అనుబంధం ఉంది.** పేషంట్ బయటికి వెళ్ళే ఇబ్బంది లేకుండా, ఎంప్లాయిన్ లాంటి రిలేబుల్ సంస్థతో టెస్ట్ అవుతాయి. ఈ రిపోర్ట్స్ ఆధారంగా కొంత మందకి ఎండోస్కోప్‌తో ఇంట్రటైంపానిక్ / **గూబలోపలికి స్టేరాయిడ్ / పిఆర్‌పి ఇంజక్షన్స్ ఇస్తాము.** దీని వల్ల ప్రారంభ స్టేజ్ వాళ్ళకి పోయిన వినికిడి వెనక్కి రావచ్చు. మోత తగ్గుతుంది. ఇంకొంతమందికి హియరింగ్ మెషిన్‌లు సజస్ట్ చేయగలం. AMPLIFON లో సంస్థ వారు 3 సంవత్సరాల వారంటీ ఇవ్వడంతో పాటు ఇంటర్నేషనల్ సంస్థ కాబట్టి మీరు ఏఊరులో ఉన్నప్పుడు రిపెయిర్ వచ్చినా దగ్గరలో ఉన్న ఏ బ్రాంచ్‌లో అయినా చూపించుకోవచ్చు. ఇది పల్నాడు జిల్లలో మన దగ్గర మాత్రమే ఈ అవకాశం ఉంటుంది.

amplifon
Hearing Care Experts

ప్రశ్న : ఫైనల్‌గా జాగ్రత్తలు ఏమి చెప్తారు ?

జవాబు : నాయిస్‌కు కుదిరిన అంత దూరంగా ఉండండి. మ్యూజిక్ కంసర్ట్స్, డిజె కి వెళ్ళినప్పుడు ఇయర్‌ఫోన్స్ / మఫ్స్ వాడండి. వాటిని వాడడం వల్ల మీ చెవిలోకి వెళ్ళే సౌండ్ 10- 15డిబి తగ్గుతుంది.

శబ్దం వినండి/ఎంజాయ్ చేయండి. అతిగా వాడవద్దు. ఏది అతిగా చేసినా ప్రమాదమే అని గుర్తుంచుకోండి.



డాక్టర్ కంజుల జగనోహ్మనరెడ్డి
M.B.B.S., M.S., D.L.O
చెవి, ముక్కు, గొంతు స్పెషలిస్ట్



డాక్టర్ కంజుల శ్రీవర్షిణి
M.S. ENT
చెవి, ముక్కు, గొంతు స్పెషలిస్ట్

కొండవీడు ఇ.ఎన్.టి హాస్పిటల్
గుంటూరు రోడ్, నరసరావుపేట
సంప్రదించండి : 08647-227356, 900045005

ప్రాయోజిత వార్త





కార్తీక అభిషేకాలకు ఏర్పాట్లు


● కార్తీక మాస పూజలకు కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి సిద్ధం



కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి మూలవిరాట్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కార్తీక మాసానికి కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధి ముస్తాబవుతోంది. ఆలయానికి తరలి వచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కార్తీక మాసంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈవో చంద్రశేఖరరావు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కార్తీక మాసంలో త్రికోటేశ్వరస్వా మికి అభిషేకం చేయడం వల్ల సర్వదోష నివారణ, సర్వకార్య సిద్ధి జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న కార్తీక మాసంలో త్రికోటేశ్వరస్వామికి విశేష అభిషే కాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పరోక్షంగా స్వామి అభిషేక పథకంలో పాల్గొనేందుకు రూ.1,000 టిక్కెట్ చెల్లించాల్సి ఉంది. ఈ పథకంలో చేరితే ప్రతి రోజు స్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ పథకంలో చేరిన సభ్యులకు స్వామి వారి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేస్తారు. కార్తీకమాసం అనంతరం స్వామి ప్రసాదం, శేషవస్త్రం కొరియర్ ద్వారా సభ్యులకు అందజేస్తారు. ఆది, సోమవారం, ఏకాదశి, పౌర్ణమి, మాస శివరాత్రి రోజుల్లో మాత్రం మూల విరాట్ అభిషేకానికి భక్తులను అనుమతించరు. ఆయా రోజుల్లో అభిషేక మండపంలో అభిషేకాలకు ఏర్పాట్లు చేశారు. రూ.500 అభిషేకం టిక్కెట్‌పై ఇద్దర్ని అభిషేకానికి అనుమతిస్తారు. స్వామి దర్శనానికి క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100 స్పెషల్ దర్శనాలకు కూడా ఏర్పాట్లు చేశారు. ఆలయంలో మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు అన్నపూర్ణ సత్రంలో అన్నదానం చేస్తారు. ప్రతి గురువారం యాగశాలలో నిర్వహించే మేధాదక్షిణామూర్తి హోమంలో పాల్గొనదలచిన భక్తులు రూ.2,116 చెల్లిస్తే హోమానికి కావాల్సిన పూజా సామగ్రిని దేవస్థానం అందజేస్తుంది. స్వామి దర్శనం అనంతరం భక్తులు ఘాట్ రోడ్డు మార్గంలో ఉన్న పర్యాటక కేంద్రాన్ని సందర్శించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట డిపోల నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను కొండపైకి ఏర్పాటు చేశారు.



కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయం






అల్లుడి కిడ్నాప్‌కి యత్నించిన అత్త



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాంబశివరావు

తెనాలి క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అల్లుడిని కిడ్నాప్ చేయించేందుకు యత్నించిన అత్త పోలీసులకు చిక్కింది. ఈ ఘటన తెనాలి చంద్రబాబు నాయుడు కాలనీలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. త్రీ టౌన్ సీఐ సాంబశివరావు వివరాల మేరకు.. సీఎం కాలనీలో నివాసం ఉండే మణికంఠకి వినుకొండలోని దూరపు బంధువుల అమ్మాయి లిఖితతో వివాహమైంది. వారికి ఒక కుమార్తె ఉంది. ప్రస్తుతం మణికంఠ భార్య 8 నెలల గర్భిణి. అయితే వివాహ అనంతరం అత్త ప్రవర్తన నచ్చక అతను భార్యను పుట్టింటికి పంపించలేదు. దీనికి భార్య కూడా తల్లిపై అయిష్టత చూపింది. దీంతో తన అల్లుడిని చంపి అయిన సరే తనతో పాటు కూతురిని తీసుకు వెళ్లాలనే ఉద్దేశంతో శనివారం రాత్రి అత్త విజయలక్ష్మి కారులో నలుగురు యువకులు తీసుకుని వెళ్లింది. ఆమెతో పాటు వినుకొండకు చెందిన మల్లెల వేణుగోపాల్, ఇంటూరు డొంక రోడ్డుకు చెందిన నక్కా కిరణ్, తెనాలి సుల్తానాబాద్‌కు చెందిన బండారు యశ్వంత్ వర్ధన్, పిడుగురాళ్ల జాన్‌పాడు రోడ్డుకు చెందిన బత్తుల కోటేశ్వరరావు ఉన్నారు. వీరందరూ రాత్రి 10.30 గంటలకు మణికంఠ ఇంటికి వచ్చి బలవంతంగా అతనిని కారులో ఎక్కించుకుని, గుంటూరు వైపు తీసుకెళ్తున్నారు. బంధువులు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఎస్ఐ కరిముల్లా తన సిబ్బందితో కలిసి కారును చేజ్ చేసుకుంటూ వెళ్లారు. శేకూరు వద్దకు చేరుకోగా అక్కడ మణికంఠపై నిందితులు కర్రలతో దాడి చేస్తుండగా పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. త్రీ టౌన్ స్టేషన్‌కి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసు విషయంలో వేగంగా స్పందించిన ఎస్ఐ కరిముల్లా, కానిస్టేబుళ్లు మురళి, చిన్న, బాబును డీఎస్పీ బి.జనార్దనరావు అభినందించారు.

దిగువకు 42,600 క్యూసెక్కులు



బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతో పాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 50,570 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 11.4 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 42,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 3,276, పశ్చిమ డెల్టాకు 4,513, గుంటూరు చానల్‌కు 151 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అనుమతి ఉండే ఇలా అమ్ముతున్నారా!

- జోరుగా అనధికార బాణసంచా విక్రయాలు
- అగ్నిప్రమాదం సంభవిస్తే ఎలా నివారిస్తారు?
- పట్టించుకోని పోలీసు, మునిసిపల్, అగ్నిమాపక శాఖ అధికారులు



పట్టాభిపురంలో అనధికారికంగా వెలిసిన బాణ సంచా దుకాణం

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనధికార బాణసంచా విక్రయ దుకాణాలు ప్రధాన రోడ్ల పక్కన వెలిశాయి. వాణిజ్య ప్రాంతాలు, నివాసాల పక్కన రోడ్లపై షామియానాలు వేసి, తోపుడు బండ్లపై గుట్టలుగా టపాసులు పోసి విక్రయాలు జరుపుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం వరకు ఎవరినీ రోడ్లపై బాణ సంచా విక్రయాలు చేపట్టకుండా పర్యవేక్షించిన పోలీసు, మునిసిపల్, పంచాయతీ, అగ్నిమాపక శాఖల అధికారులు ఏ కారణంతోనే పట్టు సడలించారు. దాంతో పట్టణ ప్రాంతాలతో పాటు మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లోనూ బాణ సంచా అమ్మకాలు ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్నాయి.

అనుమతుంటే..రక్షణ ఉన్నట్లే!

అనుమతులు లేకుండా బాణ సంచా విక్రయాలను అనుమతించబోమని పది పదిహేను రోజులుగా అధికారులు చెబుతున్నారు. దుకాణాలు ఏర్పాటుకు దరఖాస్తు పెట్టుకోవాలని ఆదేశించారు. దాంతో చాలామంది ఖాళీ ప్రదేశాలను చూసి.. అక్కడ షాపుల అనుమతుల కోసం నిర్ణీత ఫీజులు చెల్లించారు. వాటిని వివిధ శాఖల అధికారులు పరిశీలించి ఎన్‌వోసీ ఇచ్చిన తర్వాత బాణ సంచా విక్రయాలకు అనుమతించారు. గుంటూరు నగరంలో చేబ్రోలు హనుమయ్య గ్రౌండ్స్, స్వామి థియేటర్, ఏసీ లా కాలేజ్, గుంట గ్రౌండ్, రింగు రోడ్డులోని డాన్‌బాస్కో తదితర ప్రాంతాల్లో బాణ సంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చారు. ఇవి కాక ఏడాది పొడవునా టపాసులు విక్రయించే దుకాణాలు చుట్టుగుంట, పెద్దపలి వీధి, ఏటుకూరు రోడ్డు, పెదకాకాని జైజంక్షన్, నారాకోడూరు, చేబ్రోలు, మంగళగిరి వద్ద ఎన్‌హెచ్-5 పక్కన తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. వీటి వద్ద ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే వెంటనే అదుపులోకి తీసుకొచ్చేందుకు ఫైర్ ఫైటింగ్ పరికరాలున్నాయి.

తప్పుజరిగితే..బాధ్యులు ఎవరు?

సోమవారం మరిన్ని ప్రాంతాల్లో అనధికార దకాణాలు ఏర్పాటు చేసేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చాలామంది నెల ముందుగానే హోల్‌సేల్ దుకాణాలు, తమిళనాడుకు వెళ్లి బాణ సంచా కొనుగోలు చేసి తీసుకొచ్చి ఇళ్లల్లో నిల్వ చేశారు. కొందరైతే గత ఏడాది మిగిలిపోయిన వాటిని సేల్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఏదైనా ప్రమాదం జరగనంత వరకు అంతా బాగానే ఉంటుంది. జరగరానిది జరిగితే అప్పుడు యంత్రాంగం వైఫల్యం అంటూ అధికారులు/ఉద్యోగులను బాధ్యులుగా చేసే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసు, మునిసిపల్, పంచాయతీరాజ్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

22 నుంచి ఎస్ఆర్ఎంలో..

అమరావతి సాహిత్య ఉత్సవం

తుళ్లూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో అమరావతి సాహిత్య ఉత్సవం జరుగనుంది. మూడ్రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రముఖ కవులు, సాహితీవేత్తలు, విమర్శకులు, వివిధ రంగాల విద్యావేత్తలు, భాషా ప్రముఖులు పాల్గొంటారు. యూనివర్సిటీలోని భాషా సాహిత్య విభాగం అధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. వర్సిటీ యాజమాన్యం ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసింది. భాషా సాహిత్య రంగాల్లో నిష్ణాతులైన కవులు, సాహితీకారులు, విద్యావేత్తలు, విమర్శకులను ఒకే వేదికపైకి తీసుకు రావడంతో పాటు వివిధ భాషలను ప్రోత్సహించడం ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని ఉత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఆమ్లాన్ బైశ్యా పేర్కొన్నారు. వైస్ చాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ప్రముఖ తెలుగు స్త్రీ వాద రచయిత్రి పి.లలితకుమారి (ఓల్గా), పద్మశ్రీ గణేష్ ఎన్.దేవి, పి.సత్యవతి, రమేష్ కార్తీక్, కడలి సత్యనారాయణ వంటి సాహిత్య రంగ ప్రముఖులు ఉత్సవాలకు హాజరవుతున్నారు. 24న ప్రఖ్యాత కూచిపూడి కళాకారిణి కుమారి కోకా విజయలక్ష్మి బృందం తెలుగు ప్రశస్తి నృత్య రూపకాన్ని ప్రదర్శించనున్నారని తెలిపారు.

వీరాంజనేయ స్వామి సన్నిధిలో హైకోర్టు జడ్జి



ప్రత్యేక పూజలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్ కుమార్

పొన్నూరు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని మహిమాన్విత పుణ్యక్షేత్రం వీరాంజనేయ స్వామి ఆలయంలో హైకోర్టు జడ్జి జస్టిస్ తుహిన్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆయనకు సాంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. నాగవల్లి దళార్చనలో న్యాయమూర్తి పాల్గొన్నారు. జస్టిస్ తహీన్ కుమార్‌కు ఆలయ పాలకమండలి చైర్మన్ జీఎంఎస్ గుప్తా, ఈవో గద్దె అమర్నాథ్ స్వామి జ్ఞాపికను, శేష వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు.

సూర్యలంక తీరానికి..

బాపట్ల, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్ర తీరానికి హైకోర్టు జడ్జి జస్టిస్ తుహిన్‌కుమార్ ఆదివారం విచ్చేశారు. ఆయనకు ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం ఆయన హరితా బీచ్ రిసార్ట్స్‌లో విడిది చేశారు.

అట్రాసిటీ కేసులపై అధికారుల నిర్లక్ష్యం

- కమిషన్ చెప్పినా పట్టించుకోవడం లేదు
- సీఎస్‌ను కలుస్తామన్న చైర్మన్ కేఎస్ జవహర్



జవహర్ దంపతులను సత్కరిస్తున్న నక్కా ఆనంద్‌బాబు, జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, ఎమ్మెల్యేలు బూర్ల, మాధవి తదితరులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో కొంతమంది పోలీసులు, అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ చెప్పినా ఇదే వైఖరిని అవలంభిస్తున్నారని మండిపడ్డారు. త్వరలోనే సీఎస్‌ను కలిసి సమస్యను వివరిస్తామని చెప్పారు. జవహర్ మిత్రమండలి ఆధ్వర్యంలో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ విశ్రాంత డీఐజీ చావలి బాలస్వామి అధ్యక్షతన కేఎస్ జవహర్ దంపతులకు గుంటూరు ఎన్జీవో కల్యాణ మండపంలో ఆదివారం సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ జీవో నెంబరు 19తో ఉద్యోగోన్నతులు, బదిలీల్లో ఎస్సీ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రిని కలవనున్నట్లు చెప్పారు. తొలి ప్రాధాన్యం ఆత్మగౌరవమని.. ఆ తర్వాతే పదవులన్నారు. దళితులపై దాడులు, భూ ఆక్రమణలపై త్వరలో వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి జస్టిస్ పున్నయ్య 42 ప్రతిపాదనలు ప్రతిపాదిస్తే వాటిని చంద్రబాబు ఆమోదించి, అమలుకు సుమారు 15 జీవోలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ప్రత్తిపాడు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేలు రామాంజనేయులు, గళ్లా మాధవి మాట్లాడుతూ విశేషాధికారాలను ఉపయోగించి దళితులకు కమిషన్ సమగ్ర న్యాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్‌బాబు, నాయకులు మేడిద బాబురావు, సుదర్శి ప్రకాష్ కుమార్, కూచిపూడి సత్యం, పాటిబండ్ల బాలయ్య, రాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

అమరావతిలో అన్ని బ్యాంకుల కేంద్ర కార్యాలయాలు

- ఏఐబీవోసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రవికుమార్



సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న రవికుమార్

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల కేంద్ర కార్యకలాపాలు త్వరలోనే ప్రారంభమవుతాయని ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కె.రవికుమార్ అన్నారు. ఆదివారం ఆయన సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి బ్యాంకులకు రాజధానిలో స్థలాలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో బ్యాంకులు తమ కేంద్ర కార్యాలయాల భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నాయని వివరించారు. సీఎం స్పందిస్తూ.. అమరావతి రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే స్మార్ట్ క్యాపిటల్‌గా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని, అమరావతి నిర్మాణంలో సైతం భాగస్వామ్యం కావాలని కోరారు. తెలుగువారు జాతీయ స్థాయిలో బ్యాంకింగ్ రంగంలో కీలక పదవుల్లో విశేష గుర్తింపు తెచ్చుకోవడం రాష్ట్రానికి గర్వకారణమని అభినందించారు. అమరావతిలో నిర్మించనున్న క్వాంటమ్ వ్యాలీ సేవలు బ్యాంకింగ్ రంగానికి ఎంతో ఉపయోగపడుతాయని, ఈ దిశగా క్వాంటమ్ సేవలు అన్ని బ్యాంకులు వినియోగించుకుని ప్రజలకు మరింత చేరువవ్వాలని ఆకాంక్షించారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి

- రాష్ట్ర బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసులు



నూతన అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యవర్గం

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో కూడా బీసీ రిజర్వేషన్లు కల్పించాలని, బీసీఈఎఫ్‌ను ప్రభుత్వం గుర్తింపునకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఉద్యోగులు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు, గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం గుంటూరులో జరిగిన బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ ద్వితీయ మహాసభలో ఆయనను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సభకు రాష్ట్ర మహాసభ పూర్వాధ్యక్షుడు శివ పూర్ణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగులలో సగానికి పైగా భాగంలోనే బీసీలు ఉన్నారని, వీరందరికీ కూడాను ప్రభుత్వపరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం గౌరవ అధ్యక్షులుగా వీవీ రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా బట్ట భాస్కర్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోట హరిబాబు, ఉండవల్లి శ్రీనివాసరావు. ఆర్థిక కార్యదర్శిగా వరికల్లు శ్రీనివాసరావు, మరో ఐదుగురు ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఐక్యతతోనే లక్ష్యాల సాధన

- ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్ టీజీ వెంకటేశ్
- అట్టహాసంగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రశాఖ కార్యవర్గ ప్రమాణం



ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్ టీజీ వెంకటేశ్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

మంగళగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఐక్యతతోనే ఏ లక్ష్యాన్ని అయినా సాధించ వచ్చని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ తెలిపారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఆదివారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రశాఖ కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సమాజంలో గౌరవం పెరిగేవిధంగా ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. మహాత్మగాంధీ, పొట్టి శ్రీరాములు వంటి మహానుభావుల బాటలో పయనిస్తూ తమ వర్గం సంక్షేమంతోపాటు మొత్తం సమాజం బాగుకోసం పనిచేయాలన్నారు. తిరుపతిలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ భూములను అన్యాక్రాంతం చేసేందుకు ఇటీవల కొన్ని దుష్టశక్తులు కుట్ర పన్నాయని ఆరోపించారు. ఇటువంటి అక్రమాలను సామాజికవర్గం ఐక్యతతో అడ్డుకోవాలన్నారు. విజయవాడలో ప్రపంచ ఆర్యవైశ్య సదస్సును నిర్వహించాలన్న ఆలోచన ఉందన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సమాజానికి ఆదర్శంగా నిలిచేలా తమ వ్యక్తిత్వాన్ని మలుచుకోవాలని కోరారు.

ప్రమాణ స్వీకారం..

ప్రపంచ ఆర్యవైశ్యమహాసభ రాష్ట్రశాఖ అధ్యక్షులుగా మంగళగిరికి చెందిన దేవతి భగవన్నారాయణతో పాటు కార్యవర్గం చేత ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్, అంబికా దర్బార్ బత్తి అధినేత అంబికా కృష్ణ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, తాళ్లాయపాలెం శైవక్షేత్రం నిర్వహాకులు శివస్వామి, బీజేపీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు వంశీకృష్ణ, శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు దేవకి వెంకటేశ్వర్లు, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య ప్రముఖులు మాజేటి సూర్యవేణు గోపాలకృష్ణ, ఇల్లూరు లక్ష్మయ్య, కనమర్లపూడి హరిప్రసాదరావు, నూకల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

ఉపకార వేతనం దరఖాస్తుకు వేళాయె

- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్కాలర్‌షిప్
- ఈ నెల 25వ తేదీ వరకే గడువు
- డిసెంబరు 7న రాత పరీక్ష



పరీక్ష రాస్తున్న పాఠశాల విద్యార్థులు(ఫైల్ ఫోటో)

బొల్లాపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన పేద విద్యార్థుల చదువును కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తూ చేయూతనిస్తోంది. ఇందుకు ఏటా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తోంది. దరఖాస్తుకు చివరిగా ఈ నెల 25వ తేదీ వరకు గడువు విధించారు. పరీక్ష డిసెంబరు 7వ తేదీన నిర్వహిస్తారు. ప్రభుత్వ బడిలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఇందులో అర్హత సాధిస్తే 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగు సంవత్సరాల పాటు ఏటా రూ.12 వేల చొప్పున స్కాలర్ షిప్ అందుతుంది.

అర్హులు వీరు

ప్రస్తుత 2025 - 26 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు.. ఓసీలు, బీసీలు 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు లేదా దానికి సమాన మైన గ్రేడు సాధించిన వారు అర్హులు. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించకూడదు. ప్రభుత్వ, ఎయిడెడ్ స్థానిక సంస్థల పాఠశాలల్లో రెగ్యులర్‌గా చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అవకాశం ఉంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

పేద విద్యార్థులకు చక్కటి అవకాశం



కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ పరీక్ష పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థులు బాగా చదువుకుని పరీక్షల్లో ప్రతిభ చూపితే నాలుగు సంవత్సరాల పాటు ఆర్థిక వెసులుబాటు ఉంటుంది.

- ఎంఈవో చిన్నపరెడ్డి, బొల్లాపల్లి మండలం

దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు(విద్య),అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జనవరిలో జరగనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగించినట్లు డీఈవో సీవీ రేణుక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.50, బీసీ, ఓసీలకు రూ. 100 పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

యడ్లపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట గ్రామంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో దుండగులు లోపలికి చొరబడి విలువైన వస్తువులను అపహరించుకుపోయారు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ ఖైరున్నీసా ఈ నెల 16న మధ్యాహ్నం ఇంటికి తాళంవేసి నరసరావుపేటలోని కోడలు ఇంటికి వెళ్లింది. తిరిగి శనివారం సాయంత్రం ఇంటికి చేరుకుంది. లోపల వస్తువులు చిందవందర పడి ఉండటాన్ని గమనించింది. వంటగదిలో పాత్రల మధ్య దాచి ఉంచిన 12 గ్రాముల బంగారు గొలుసు, 4 గ్రాముల దుద్దులు, వెండి పట్టీల తోపాటు, ఇత్తడి సామాన్లు చోరీకి గురైనట్లు గుర్తించింది. దుండగులు ఇంటి కిటికీ మెష్ తొలగించి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు గుర్తించి.. ఆదివారం యడ్లపాడు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు క్లూస్‌టీంతో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.



లాంచీ స్టేషన్ వద్ద పర్యాటకులు

నాగార్జున కొండపై పర్యాటకుల సందడి

విజయపురిసౌత్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు శాంతిసిరి, నాగసిరి, అగస్త్యా లాంచీలలో చేరుకున్నారు. కొండపై గల మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం తదితరాలను పర్యాటకులు సందర్శించారు. అనుపులోకి అశ్వమేధ యజ్ఞశాల, శ్రీచైత్యము, యాంపీ థియేటర్, శ్రీరంగనాథస్వామి ఆలయం వీక్షించారు. ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు.లాంచీల ద్వారా ఆదివారం ఒక్కరోజు రూ. 1,02,230 ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

- ఆదర్శభావాలతో గొప్పవ్యక్తులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలి
- పదిలో వినుకొండ విద్యార్థి జిల్లా ఫస్ట్ వస్తే రూ.5 లక్షల రివార్డు
- నూతన ఉపాధ్యాయుల సత్కార సభలో చీఫ్ విప్ జీవీ

వినుకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యా యులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సూచిం చారు. మెగా డీఎస్సీలో ఎంపికైన వినుకొండ నియోజకవర్గ పరిధిలోని ఉపాధ్యాయులకు ఆదివారం చీఫ్ విప్ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జీవీ మాట్లాడుతూ విద్యార్థులను ఆదర్శభావాలతో కూడిన గొప్పవ్యక్తులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులపై ఉంద న్నారు.అబ్దుల్ కలాం, బీఆర్ అంబేద్కర్ లాంటి గొప్పవ్యక్తు లను సమాజానికి అందించింది గురువులేనని గుర్తుచేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలతో పాటు వ్యక్తిత్వాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందిం చాలన్నారు. సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి భావాలను విద్యార్థుల్లో కలిగించాలని కోరారు. రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగ యువతకి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. చంద్రబాబు స్ఫూర్తితో పీ-4 ద్వారా తాను 100 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు చెప్పారు. పదో తరగతిలో వినుకొండ పరిధిలోని ప్రభుత్వ పాఠశా లల విద్యార్థి జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధిస్తే ఆ విద్యార్థికి శివశక్తి ఫౌండేషన్ ద్వారా రూ.5 లక్షల రివార్డు ఇస్తామని జీవీ ప్రకటించారు. జిల్లా పరిధిలో ఏ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధిస్తే ఆ విద్యార్థికి రూ.2 లక్షలు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల వారీగా విద్యార్థులు అధికశాతం ప్రతిభ చూపితే ఆ ఉపాధ్యా యులకు రూ.లక్ష రివార్డు ఇస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, వినుకొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ మీసాల మురళి, డిప్యూటీ డీఈవో ఎస్ఎం సుభాని, ఎంఈవో జఫ్రుల్లాఖాన్, ఉపాధ్యాయులు, జనసేన నాయకులు నాగ శ్రీనురాయల్, నిశ్శంకర్రావు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



నూతన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

జీవితాన్ని నూతనీకరించుకోవాలి

- క్రీస్తు జయంతి వేడుకల్లో బిషప్ భాగ్యయ్య

రెంటచింతల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరూ తమ జీవితాలను నూతనీకరించుకోవాలని, తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసుకోవాలని గుంటూరు మేత్రాసన పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య కోరారు. పల్నాడు డీనరీ స్థాయిలో రెంటచింతలలోని ఆర్‌సీఎం చర్చిలో క్రీస్తుజయంతి జూబ్లీ వేడుకల ముగింపు ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పీఠాధిపతి ప్రత్యేకంగా సందేశమిచ్చారు. దానధర్మాలు, దైవప్రార్థనలతో మానవులు మంచి మనస్సును పొందుతారని చెప్పారు. మారు మనస్సుతో సమాజాభివృద్ధి కార్యక్రమాల్లో ముందుండి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. క్రైస్తవులు పరమ పవిత్రంగా భావించే రోమ్‌ను జీవితంలో ఒక్కసారైనా సందర్శించాలని సూచించారు. ఇటీవల మరణించిన పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులర్పించారు. దివ్యబలిపూజ, దివ్యసప్రసాదం, స్తుతి ఆరాధన, దైవవాక్య బోధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఫాతిమా పాఠశాల బాలికల నృత్యాలు అలరించాయి. అన్నసంతర్పణ చేశారు. బాణసంచా శబ్దాలతో గ్రామం దద్దరిల్లింది. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు వైఎల్ మర్రెడ్డి, గోవిందు బాలస్వామి, ఎలీషారాజ్, వై.బాలశౌర్రెడ్డి, రత్నబాబు, రత్నరాజు, పామిశెట్టి సాగర్, మర్రి అనిల్, సహాయ విచారణగురువులు ప్రసన్నకుమార్, కన్యాస్త్రీలు,మరియదళ సభ్యులు, విశ్వాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న బిషప్ సీహెచ్ భాగ్యయ్య

ఉద్యోగుల జీవితాల్లో దీపావళి వెలుగులు

- డిమాండ్లపై ముఖ్యమంత్రి స్పందన హర్షణీయమన్న నేతలు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): నవంబరు నుంచి ఒక డీఏను విడుదల చేయడం ద్వారా ఉద్యోగ కుటుంబాల్లో దీపావళి వెలుగులు నింపారని ఏపీ ఎన్జీవో జిల్లా అడహక్ కమిటీ ఛైర్మన్ మర్లపాటి రామకృష్ణ తెలిపారు. నరసరావుపేటలోని ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి స్పందన హర్షణీయమన్నారు. 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీ ఏర్పాటు, బీమా పాలసీ పరిశీలన, ఆర్టీసీలో ఉద్యోగోన్నతులపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటిం చారని తెలిపారు. ఉద్యోగుల సమస్యల సాధనలో ఇది మొదటి అడుగు మాత్రమేనని చెప్పా రు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సచివా లయాల నోషనల్ ఇంక్రిమెంట్లు ప్రమోషన్స్, గురుకుల పాఠశాలలో ప్రభుత్వ రంగ సంస్థల వయోపరిమితి 60 నుంచి 62 పెంచడం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం తదితర అంశాల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగ సంఘం నేతలు

రేపు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

- మంగళగిరి బెటాలియన్‌లో కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- రిహార్సల్ పరేడ్‌ను పరిశీలించిన ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం జరగనున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. ఈ క్రమంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్ ఇతర అధికారులతో కలసి ఆదివారం పరిశీలించారు. రిహార్సల్ పరేడ్ నిర్వహించగా, కార్యక్రమంలో డీఐజీ ఫకీరప్ప కాగినేల్లి, మల్లికాగార్గ్, సరిత తదితరులు పాల్గొని, పరిశీలించి పలు సూచనలు చేశారు. రిహార్సల్ సమయంలో వీవీఐపీ, వీఐపీలకు ఆహ్వానం అందించే విధానం, పోలీస్ గౌరవ వందనం సమర్పణ తీరుతెన్నులు, అమరవీరులకు పుష్పాంజలి అర్పించే విధానం, పరేడ్ సమన్వయం, ఫొటోగ్యాలరీ వీక్షణ తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ప్రధాన కార్యక్రమానికి విచ్చేసే వీవీఐపీ, వీఐపీల రాకపోకల మార్గాల్లో బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, సభా ప్రాంగణంలో వారిని గౌరవించి ఆహ్వానించడానికి కేటాయించిన అధికారుల విధులను ఎస్పీ సమీక్షించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రమణమూర్తి, ఏటీవీ రవికుమార్, సుప్రజ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

అట్రాసిటీ కేసులపై అధికారుల నిర్లక్ష్యం

కమిషన్ చెప్పినా పట్టించుకోవడం లేదు

సీఎస్‌ను కలుస్తామన్న ఛైర్మన్ కేఎస్ జవహర్



జవహర్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు ఆనందబాబు, గళ్లా మాధవి

6

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటి మట్టం ఆదివారం నాటికి 588.30 అడుగులు ఉంది. ఇది 306.98 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,302, ఎడమ కాలువ ద్వారా 8,718, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,292, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 53,412 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 41,682 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0661 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్‌ఈ కె. వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. 20 రేడియల్ క్రస్ట్ గేట్లకుగాను 3 గేట్లను 1.50 మీటర్ల మేర ఎత్తి 21,258, టేల్‌రేస్ ఛానల్ ద్వారా 8,545, మొత్తంగా 29,803 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 34,185 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50(పూర్తి స్థాయి) మీటర్ల మేర నీరుండగా..ఇది 7.080 టీఎంసీలకు సమానమని తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 44.13 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 30,723 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, ఒక గేటు ద్వారా 20,773, మొత్తం 37,773 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

స్టూడెంట్స్ స్ట్రీట్ ఫైట్..!

ముప్పాళ్ళ అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఇరుకు పాలెంలో రెండురోజుల క్రితం కళాశాల బస్సు ఆపి తొండపి విద్యార్థిపై మాదల విద్యార్థి, అతని స్నేహితులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. సత్తెనపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాల ఇంటర్ విద్యార్థులు మనస్పర్థలతో ఒకరిపై మరోకరు దాడి చేసుకున్నారు. ఈ విషయాన్ని మాదల విద్యార్థి తన స్నేహితులకు చెప్పడంతో.. వారు ఇరుకుపాలెం వద్ద కళాశాల బస్సును ఆపి నలుగురు తొండపి విద్యార్థిపై దాడి చేశారు. దాడిని అడ్డుకున్న మరో ముగ్గురు విద్యార్థులపై పిడిగుద్దులు కురిపించారు. ఈ ఘర్షణలో మొత్తం నలుగురికి గాయాలయ్యాయి. వారు మాదలలోని ఆర్ఎంపీ వద్ద వైద్య చేయించుకున్నట్లు సమాచారం. ఈ దాడి ఘటన మొత్తం బస్సులో ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యింది. దీనిపై ఎస్ఐ సోమేశ్వరరావును వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దాచేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వట్టెపు బెంజిమెన్(58) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. పోలీసులు వివరాల మేరకు.. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బెంజిమెన్ దాచేపల్లిలో సరుకుల కోసం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. అదుపు రోడ్డుపై పడి పోయాడు. అతని తలకు తీవ్ర గాయమై గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులకు మేలు

● ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు మేలు జరిగే విధంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఐదేళ్లు ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నేతలకు అపాయింట్‌మెంట్ దొరకని పరిస్థితులు ఉన్నాయని, కొందరు నేతలే అన్నీ తామై వ్యవహరించారన్నారు. ఐదేళ్ల పాటు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా జగన్ ప్రభుత్వం కాలయాపన చేసిందన్నారు. ఇప్పుడు చంద్రబాబు, లోకేశ్ హయాంలో మెగా డీఎస్సీ ప్రకటించి నియామక ప్రక్రియను కూడా పూర్తిచేయడం జరిగిందన్నారు. చంద్రబాబు ఉద్యోగులకు నవంబరు నెల నుంచి ఒక డీఏ ప్రకటించడం పట్ల లక్షలాది మంది ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నేతలు కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలియజేస్తున్నారన్నారు. ఉద్యోగుల కుటుంబాలు ఆనందంగా దీపావళి జరుపుకుంటాయన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ వెంకట్రావు, శ్రీనివాసరెడ్డి, జగదీష్‌రెడ్డి

ఉత్సాహంగా సాఫ్ట్‌బాల్ సీనియర్స్ జిల్లా జట్టు ఎంపిక

పిడుగురాళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కళ్లం టౌన్‌షిప్‌లోని స్కాలర్స్ డిగ్రీ కళాశాల మైదానంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికల పోటీలను పట్టణ సీఐ ఎస్.వెంకట్రావు ఆదివారం ప్రారంభించారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అసోసియేషన్ కార్యదర్శి పి.సామంతరెడ్డి, కోశాధికారి ఆవుల జనార్దనరావు, స్కాలర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మూలగుండ్ల జగదీష్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టు

పి.బాలకృష్ణ, డి.రాంబాబు, జె.బైసన్‌బాబు, బి.అనిల్‌కుమార్, ఎం.ప్రేమ్‌కుమార్, వై.గోపి, సాగర్‌బాబు, హేమంత్, శివకోటేశ్వరరావు, సల్మాన్, నరేంద్ర, యశ్వంత్, జానారెడ్డి, జేమ్స్ అభినవ్, ఎ.మెర్సీ ప్రభాకర్, స్టాండ్ బై.. గౌతమ్‌శ్రీ హర్ష, సంజీవ్‌బాబు, కార్తీక్, పవన్, కిరణ్‌నాయక్.

లోకేశ్‌కు ఆస్ట్రేలియాలో స్వాగతం

నూజెండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు మెల్‌బోర్న్ టీడీపీ అధ్యక్షుడు లగడపాటి సుబ్బారావు, మిత్ర బృందం ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు.



లోకేశ్‌కు బొకే అందజేస్తున్న సుబ్బారావు

హేతువాద సాహిత్య పితామహుడు త్రిపురనేని

కోయి కోటేశ్వరరావు, ఆలా వెంకటేశ్వర్లుకు..

త్రిపురనేని రామస్వామి పురస్కారం ప్రదానం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట హేతువాద సాహిత్యానికి పునాదులు వేసిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి చౌదరి అని ప్రముఖ సాహిత్య విమర్శకుడు జి. లక్ష్మీ నరసయ్య అన్నారు. గుంటూరు సీపీఎం కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణ రావు అధ్యక్షతన కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ రామస్వామి సాహిత్యానికి వారసుడు కోయి కోటేశ్వరరావుకు, రామస్వామి సామాజిక సంస్కరణల ఉద్యమానికి వారసుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు ఈ పురస్కారాలు అందజేయడం సముచితమని అన్నారు. సభలో మరో ముఖ్యఅతిథి విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ మాట్లాడుతూ వందేళ్ల క్రితం సమాజంలో ఉన్న అసమానతల మీద తిరుగుబాటు సాహిత్యం రచించిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి అని అన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగునాట బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించింది రామస్వామి అని గుర్తుచేసుకున్నారు. అనంతరం కోయి కోటేశ్వరరావు, ఆలా వెంకటేశ్వర్లుకు త్రిపురనేని రామస్వామి పురస్కారాలను ప్రదానం చేసి వారిని ఘనంగా సత్కరించారు. సభలో ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టారు, డాక్టర్ అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరరీ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్, డాక్టర్ మూకిరీ సుధ తదితరులు ప్రసంగించారు.



ఆలా వెంకటేశ్వర్లుకు పురస్కారం ప్రదానం చేస్తున్న ప్రముఖులు

ప్రకృతి వ్యవసాయంతో ఉజ్వల భవిష్యత్తు


● ఆదర్శంగా యలవర్తి మహేష్ ప్రకృతి వ్యవసాయం

● స్థానికంగా ఉత్పత్తుల విక్రయాలతో.. ప్రజలకు అవగాహన

● అభ్యుదయ రైతుగా అవార్డు



వేల్పూరులో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహేష్



అభ్యుదయ రైతు అవార్డును అందుకొంటున్న మహేష్

వేల్పూరు (శావల్యాపురం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కల్తీలేని ఆహారంతోనే బావితరాలకు ఆరోగ్యకరమైన జీవితం ఏర్పడుతుందని భావించాడు. బావితరాలకు ఉజ్వలమైన భవిష్యత్తు అందించాలన్న సంకల్పంతో ప్రకృతి వ్యవసాయం చేయడాన్ని ఆరంభించాడు. ప్రారంభంలో ఆర్థికంగా నష్టాలను చవి చూసినప్పటికీ నలుగురికీ మంచి జరగాలన్న ఆశయంతో ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కొన్నాడు. ఒకవైపు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు తాను నమ్మిన ఆశయం కోసం అడుగులు వేశాడు. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన యలవర్తి మహేశ్ ప్రకృతి వ్యవసాయం చేస్తూ అభ్యుదయ రైతుగా నేడు ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాడు. తాను స్వయంగా పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను గ్రామంలో దుకాణాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు విక్రయిస్తున్నాడు. స్థానికంగా నివాసముంటూ ప్రకృతి వ్యవసాయం ఉపయోగాలు, భవిష్యత్తు తరాలకు వాటి వలన కలిగే ప్రయోజనాలను రైతులందరికీ వివరిస్తూ గ్రామస్థులందరి మన్ననలను పొందుతున్నాడు.



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

2016లో వ్యవసాయం ప్రారంభం

వ్యవసాయ కుటుంబంలో పుట్టిన మహేష్‌కు చిన్నతనం నుంచే వ్యవసాయంపై మక్కువ. భావితరాలకు ఉపయోగపడేలా ఆరోగ్యవంతమైన పంటలు పండిచాలన్న ఉద్దేశంతో 2016లో ప్రకృతి వ్యవసాయాన్ని చేయడం ప్రారంభించాడు. అప్పటికే ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగం చేస్తున్న మహేశ్ తన కుటుంబసభ్యులు సహకారంతో సెలవు దినాల్లో స్వగ్రామానికి వచ్చి వ్యవసాయ పనులు చేసేవాడు. 2022లో ఎయిర్‌ఫోర్స్ నుంచి రిటైరయి అప్పటి నుంచి ప్రకృతి వ్యవసాయంపైనే ప్రత్యేక దృష్టిని సారించాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొని ప్రకృతి వ్యవసాయంపై మంచి అవగాహన సంపాదించాడు. పొలంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించి తక్కువ పెట్టుబడితో యంత్రపరికరాలను వినియోగించి లాభసాటిగా వ్యవసాయం చేయడాన్ని ప్రారంభించాడు. పంటలు సాగుచేస్తున్న విధానాన్ని గ్రామంలోని రైతులకు వివరిస్తూ వారిలో స్ఫూర్తిని నింపాడు.

అభ్యుదయ రైతుగా ఎంపిక

మహేశ్ సేవలను గుర్తించిన ప్రభుత్వం 2025 జనవరిలో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం వారు నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో అభ్యుదయ రైతుగా ఎంపిక చేసింది. రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేతుల మీదుగా అభ్యుదయ రైతు అవార్డును అందుకొన్నారు. అభ్యుదయ రైతుగా ఎంపికైన యలవర్తి మహేష్‌ను పలువురు అభినందిస్తున్నారు.

బావితరాలకు కల్తీలేని ఆహారం లక్ష్యం: మహేష్

భావితరాలకు ఎటువంటి కల్తీలేని ఆహార ఉత్పత్తులను అందించి తద్వారా వారు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలన్నదే లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించాను. ప్రస్తుతం స్వగ్రామంలో రైతులందరి సమక్షంలోనే వ్యవసాయం చేస్తూ వారికి కూడా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, నమ్మకాన్ని కల్పిస్తున్నాను. పండించిన ఆర్గానిక్ ఉత్పత్తులు ప్రజలకు తక్కువ ధరలకే అమ్ముతున్నాను. భవిష్యత్తులో మరింత మంది ఆర్గానిక్ ఉత్పత్తులు పండించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నాను. ఆర్గానిక్ ఉత్పత్తులు మరింతగా పెరిగాక చుట్టుపక్కల గ్రామాల వారికి విక్రయించేందుకు కృషి చేస్తున్నాను. ఇదంతా నాకు ఎంతో సంతృప్తినిస్తోంది.

రైలులో మహిళపై..
అత్యాచారం, దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు సమీపంలో సంత్రాగచ్చి - చర్లపల్లి స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన మహిళపై అత్యాచారం... దోపిడీ చేసిన కేసులో నిందితుడుని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆదివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడుకు చెందిన జొన్నలగడ్డ రాజారావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 13న రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన బాధితురాలు రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో సంత్రాగచ్చి - చర్లపల్లి స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ బయలుదేరింది. రైలు నల్లపాడు రైల్వే స్టేషన్ దాటిన లేడీస్ కంపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా ఉన్న బాధితురాలికి నిందితుడు కత్తిని చూపించి బెదిరించి, ఆమెను కొట్టాడు. ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత రైలు నెమ్మదిగా పెదకూరపాడు రైల్వే స్టేషన్‌ను సమీపిస్తుండగా, ఆమె వద్ద నుంచి పరుసు, సెల్ ఫోన్‌ని లాక్కుని నిందితుడు కదులుతున్న రైలు నుంచి దూకి పారిపోయాడు. ఆ తర్వాత బాధితురాలు అదే రైలులో సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు జరిగిన ఘటనపై ఫిర్యాదు చేసింది. నిందితుడు మూడు నెలలుగా గుంటూరు కేంద్రంగా రైల్వే స్టేషన్, రైళ్లలో తిరుగుతూ కామోన్మాదంతో నేరాలు చేసేందుకు యత్నిస్తున్నాడు. రాజారావు వేధింపులు తట్టుకోలేక ముఖ్యంగా భార్య, పిల్లలు పుట్టింటికి వెళ్లింది. నిందితుడు ఇదే తరహాలో ఒకరిద్దరిపై కూడా ఇలాగే అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చినప్పటికీ బాధితుల నుంచి ఫిర్యాదు రాకపోవడంతో ఆయా ఘటనలపై పోలీసులకు స్పష్టత రాలేదు. నిందితుడు బాధితురాలి సెల్ ఫోన్‌లోని సిమ్ కార్డును తనసెల్‌ఫోన్‌లో వేసుకోవడంతో పోలీసులు నిందితుడిని వెంటనే పట్టుకోగలిగారు. రైల్వే సీఐలు కరుణాకరరావు, అంజిబాబు, ఎస్సైలు రాజమోహన్, పిరమేష్, వెంకటాద్రి, వీరబాబు, శ్రీనివాసరెడ్డి, హెడ్ కానిస్టేబుళ్ళు బి శంకరరావు, బి.అశ్వినికుమార్, వి.శంకర్‌ను రైల్వే ఉన్నతాధికారులు అభినందించారు.

కాల్చితే ఆనందం..పేలితే ప్రమాదం

సత్తెనపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళి అంటేనే బాణ సంచా వేడుకలు. వాటిని కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోక పోతే పలు ప్రమాదాలకు తోడు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. బాణ సంచా కాల్చే సమయంలో పిల్లలు, పెద్దలు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా, మొరటుగా వ్యవహరించినా ప్రమాదాల భారిన పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం తయారు చేస్తున్న బాణ సంచాలో రసాయనాలు ఎక్కువగా ఉంటున్నాయి. వీటి వల్ల అనారోగ్యంతో పాటు పర్యావరణానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. బాణ సంచాలో పొటాషియం నైట్రేట్, సల్ఫర్, చారోపోల్, మాంగనీస్ తదితర రసాయానాలు ఎక్కువగా ఉంటున్నాయి. ర్యాకెట్లు, స్విచ్ బుడ్లు పేల్చినప్పుడు అనేక విష పదార్థాలు వాతావరణంలో కలుస్తున్నాయి.

అశ్రద్ధ చేస్తే రుగ్మతలు

కళ్ళు మంటలు, ఊపిరి తిత్తుల్లో నెమ్ము, గొంతు వాపు, జలుబు, తల నొప్పి, ఛాతిలో బరువు, శ్వాస కోశ ఇబ్బందులు, టపాసుల పొగ పీల్చాక పది నుంచి 15 నిమిషాల్లో సల్ఫర్ డయాక్సైడ్ ప్రభావం చూపుతుంది. మానసిక నరాల సమస్యలు, రక్త సంబంధిత వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ కారక వ్యాధులు, నిద్రలేమి, వినికిడి శక్తి తగ్గి పోవటం, హైబీపీ సమస్యలు ఎదుర్కొంటారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

టపాసులు కాల్చే సమయంలో శరీరానికి బిగుతుగా ఉండే దుస్తులు ధరించ రాదు. సిల్క్ దుస్తులు ధరించ రాదు. కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి. పేలుడు పదార్థాలు కాల్చే సమయంలో పెద్దలు చిన్నారుల వద్ద ఉండాలి. టపాసులు కాల్చే సమయంలో నీరు, ఇసుక దగ్గరలో ఉంచు కోవాల్సి టపాసులు, చిచ్చు బుడ్లు చేతుల్లో ఉంచి కాల్చ కూడదు. టపాసులను స్రాంబ్రాణి కడ్డీలతో ఇంటించ కుండా ఉండటం మంచిది. మూతికి గుడ్డ కట్టుకోవాలి.

కళ్లపై తీవ్ర ప్రభావం : డాక్టర్ అరుణ, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి



టపాకాయల ప్రభావం కంటిపై తీవ్రంగా ఉంటుంది. టపాసుల్లో పొటాషియం నైట్రేట్, క్లోరైడ్, అల్యూమినియం, నైట్రేట్ మొదలైన వెలుగులు విరజిమ్మి రసాయానాలు ఎక్కువగా ఉంటాయి. వీటి ద్వారా వెదజల్లే రసాయానాలు కంటి పై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. టపాసులు కాల్చేసమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోక పోతే కంటి పై పొర దెబ్బతినే అవకాశం ఉంటుంది.

చిగురిస్తున్న ఆశలు..



● తిరిగి జీవం పోసుకుంటున్న నిర్మాణాలు

● తరలివచ్చిన సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం

● త్యాగమూర్తుల రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు

● రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి పై దృష్టిసారించిన సీఆర్డీఏ

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి నిర్మాణం ఇప్పటి వరకూ ఒకలెక్క.. ఇక నుంచి ఒక లెక్క అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. రాజధాని నిర్మాణంలో కీలక భూమిక పోషించే ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం అమరావతికి తరలిరావడంతో రాజధాని గ్రామాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. రాజధాని గ్రామాల్లో తిరిగి అభివృద్ధి పనులు ప్రారంభమవుతుండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రాజధాని నిర్మాణానికి సంబంధించి ఒక్కో అడుగు ముందుకు పడుతుండడమే కాదు.. ఇప్పటి వరకూ ముందరి కాళ్లకు బంధాలుగా మారిన సమస్యలూ ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయి. ఇక రాజధాని నిర్మాణం నల్లేరు మీద నడకే అన్నట్లుగా పనులు సాగుతున్నాయి. అడపాదడపా కురిసే వర్షాల మూలంగా ఇబ్బందులు మినహా రాజధాని నిర్మాణానికి ప్రధాన ఆటంకాలు ఏమీ లేవనే చెప్పాలి. ఈ నెల దాటితే ఆ వర్షాలకు కూడా టాటా చెప్పి రాజధాని నిర్మాణాన్ని పరుగులు పెట్టించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ సీఆర్డీఏ ఉన్నాయి.

సీఆర్డీఏ కార్యాలయం ప్రారంభంతో నూతనోత్సాహం

రాజధాని నిర్మాణంలో ఏపీ సీఆర్డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్)లదే కీలకపాత్ర. ఇప్పటి వరకూ వాటి ప్రధాన కార్యాలయాలు రాజధానికి దూరంగా విజయవాడలో ఉండి కార్యకలాపాలు నిర్వహించాల్సి వచ్చేంది. ఈ నెల 13న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాయపూడిలో నిర్మించిన సీఆర్డీఏ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. దీంతో ఇప్పటి వరకూ విజయవాడలో ఉన్న సీఆర్డీఏ, ఏడీసీఎల్ కార్యాలయాలు అమరావతికి తరలివచ్చాయి. ఫలితంగా ఇకపై రాజధాని నిర్మాణ పనులు, పురోగతిపై ఈ కార్యాలయాల ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండబోతోంది. ఈ కారణంగా పనుల్లో వేగం మరింత పెరగనుంది.

భూ సమీకరణ అడ్డంకులు తొలగడంతో..

రాజధాని కోసం 33,800 ఎకరాల భూములు సమీకరించాలని గతంలో టీడీపీ ప్రభుత్వం భావించగా, ఉండవల్లి, పెనుమాక, నిడమర్రు గ్రామాల్లో కొంతమంది రైతులు నిరాకరించారు. ఆ కారణంగా సుమారు 3 వేల ఎకరాల భూమి సమీకరణలోకి రాకుండా ఆగిపోయింది. తాజాగా కొందరు రైతులు భూ సమీకరణకు ముందుకు రావడంతో దాదాపు 350 ఎకరాల భూమిని ప్రభుత్వం సమీకరించగలిగింది. మిగిలిన రైతుల్లో కూడా సానుకూల స్పందన కనిపిస్తుండడంతో ఆ సమస్యకు కూడా త్వరలో పరిష్కారం లభించే అవకాశం కనిపిస్తోంది. రైతులు భూములివ్వడానికి ముందుకు రావడంతో గతంలో ఆగిపోయిన పనులు వేగం పుంజుకున్నాయి. ఉండవల్లి, పెనుమాక రైతులు భూసమీకరణకు అంగికరించడంతో గతంలో వెంకటపాలెంలోని మంతెన సత్యనారాయణ ఆశ్రమం వరకూ వచ్చి ఆగిపోయిన సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం వేగం పుంజుకుంది. ఎన్‌హెచ్ 16పై ఉన్న కనకదుర్గమ్మ వారధి వరకూ విస్తరించేందుకు మార్గం సుగమమయింది. ఇప్పటికే చాలా వరకూ పనులు మొదలయ్యాయి కూడా.

తర్వాత ప్రారంభమయ్యేది ఐఏఎస్ అపార్ట్‌మెంట్లే

రాజధాని నిర్మాణంలో భాగంగా ఇప్పటికే సీఆర్డీఏ కార్యాలయం ప్రారంభం కాగా, త్వరలో ఆలిండియా సర్వీసెస్ ఉద్యోగుల భవనాలు ప్రారంభమవుతాయని తెలుస్తోంది. అదే జరిగితే తొలిగా ప్రారంభమయ్యే ప్రభుత్వాధికారుల నివాసాలు ఇవే అని చెప్పాలి. వీటికి సంబంధించి బయటివైపు పనులన్నీ పూర్తయ్యాయి. ఇంటీరియర్ పనులు వేగంగా జరుగుతున్నాయి. వాటితో పాటు ప్రజాప్రతినిధుల భవన సముదాయాలైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అపార్ట్‌మెంట్ల పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు తుది మెరుగులు దిద్దుతుండగా, ఎమ్మెల్సీ క్వార్టర్స్ నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శుల, కార్యదర్శుల భవనాల నిర్మాణం కూడా వేగంగా సాగుతోంది. ఇప్పటికే కొన్ని భవనాలు తుది మెరుగులు దిద్దుకుంటుండగా, మరికొన్ని భవనాల నిర్మాణం వేగం పుంజుకుంది. హైకోర్టు న్యాయమూర్తుల గృహ సముదాయం, మంత్రుల గృహసముదాయం పనుల్లో కూడా పురోగతి కనిపిస్తోంది.

అత్యంత వేగంగా మౌలిక సదుపాయాల కల్పన

రాజధానిలో ప్రతిష్టాత్మక సంస్థలు అడుగుపెడుతున్న నేపథ్యంలో సీఆర్డీఏ మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టింది. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా తొలి ప్రాధాన్యంగా రహదారుల నిర్మాణాన్ని చేపట్టింది. రహదారుల నిర్మాణంలో భాగంగా వాటర్ లైన్, మురుగు, వరద నీటి డ్రైన్, అండర్ గ్రౌండ్ విద్యుత్, కమ్యూనికేషన్ లైన్ల కోసం ఏర్పాటు చేసే యుటిలిటీ డక్టుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులకు వర్షాలు తీవ్ర ఆటంకాలు కలిగిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలోనే పనులు జరగుతుండడం పట్ల రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి

రాజధాని కోసం భూములిచ్చిన రైతుల రుణం తీర్చుకోవాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారు. ఇటీవల సీఆర్డీఏ కార్యాలయ ప్రారంభ సమయంలో రైతులతో ప్రత్యేకంగా సమావేశమై అదే విషయాన్ని నొక్కి చెప్పారు. 'మీ త్యాగం మర్చిపోను. త్యాగమూర్తులకు రెట్టింపు గౌరవ మర్యాదలు, ఆదాయం వచ్చేలా చేస్తానని' ముఖ్యమంత్రి వారికి మాటిచ్చారు. ఈ నేపథ్యంలోనే సీఆర్డీఏ తాజాగా రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించింది. రాజధాని గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో అంతర్గత రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించింది. ఈ పనులు కూడా పూర్తయి రైతులకు ప్లాట్లు దక్కితే, అక్కడ కూడా నిర్మాణాలు జరిగే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ మొదలైతే రాజధాని నిర్మాణాన్ని ఆపడం ఎవరి తరం కాదని రైతులు చెబుతున్నారు. రాజధాని నిర్మాణ పనులు వేగంగా జరుగుతుండడం పట్ల రాజధాని ప్రాంత వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రైతుల ముఖాల్లో ఆనందం చిగురిస్తోంది.



బయటి పనులు పూర్తైన ఎమ్మెల్యే క్వార్టర్స్

తుది దశకు చేరిన ప్రధాన కార్యదర్శుల నివాసాలు



పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట


ఎస్పీ బాలు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నిర్వాహకులు

ఘనంగా పాటల పోటీలు

వినుకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కళాసాగరి- రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎస్పీ బాలు స్మారక రాష్ట్రస్థాయి పాటల పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వినుకొండ పురపాలక సంఘం చైర్మన్ డాక్టర్ దస్తగిరి సతీమణి కౌన్సిలర్ షకీలా దస్తగిరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత ఎస్పీ బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దాదాపు 70 మంది గాత్ర కళాకారులు పోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళి కృష్ణయాదవ్, విద్యావంతుల వేదిక బాధ్యులు సీనియర్ న్యాయవాది పీజీ లూకా, కళాసాగరి అధ్యక్షులు ఆలా శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ కూచి రామాంజనేయులు, న్యాయవాది విజయ్ నరసింహారావు, రోటరీ అధ్యక్ష కార్యదర్శులు వై.వెంకటనారాయణ, బాజీ, కళాసాగరి కార్యదర్శి గుత్తా గురునాథం తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో నివాసం ఉండకపోతే కేటాయింపు రద్దు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


సమావేశంలో వివరాలు తెలుసుకుంటున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలను పొందినవారు వాటిలో నివాసం ఉండకుండా నిరుపయోగంగా ఉంచడాన్ని ప్రభుత్వం సహించదని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో టిడ్కో గృహాలు, రుణ సమస్యలు, మెప్మా విభాగం పనితీరుపై బ్యాంకర్లు, మెప్మా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాలలో నివాసముండని లబ్ధిదారులకు తక్షణమే నోటీసులు జారీ చేసి, వివరణ తీసుకోవాలని, వారి సమాధానం సంతృప్తికరంగా లేకుంటే, గృహాల మంజూరును రద్దుచేసి వాటిని అర్హులైన ఇతరులకు కేటాయించాలని స్పష్టం చేశారు. పట్టణంలో ఇంకా 509 మంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు కాలేదన్న సమస్యపై స్పందిస్తూ అర్హులైన వారికి వెంటనే రుణాలు అందించాలని, టిడ్కో గృహాలలో నివాసముంటేనే రుణమిస్తామనే హామీ కూడా తీసుకోవాలని సూచించారు. గృహాలు పొంది రుణం చెల్లించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి శ్రీహరి బాబు, మెప్మా పీడీ మురళీ కృష్ణ, డీసీవో శేఖర్ బాబు, మెప్మా సీఏఎం అరిఫా సుల్తానా, టిడ్కో అధికారులు రాకేష్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

34 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన 34 మందికి రూ.25.31 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం త్వరలోనే సంజీవని అనే పథకాన్ని అమల్లోకి తీసుకురాబోతున్నదని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, జవ్వాజి మదన్ మోహన్, మద్దుమల రవి, మురకొండ మల్లిబాబు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రత్తిపాటి

ప్రత్తిపాటి దీపావళి శుభాకాంక్షలు

చిలకలూరిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, కూటమి పార్టీల శ్రేణులకు స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి రాష్ట్రప్రజలకు ఎంతో ప్రత్యేకమని, ప్రతిష్టాత్మక ప్రపంచ స్థాయి సంస్థ గూగుల్ విశాఖలో భారీ పెట్టుబడి పెట్టే దిశగా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడం నిజంగా ప్రజలు గర్వించాల్సిన విషయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఆవరించిన అంధకారం తొలగించి, ప్రజల జీవితాల్లో వెలుగుల నింపాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.

పల్నాడు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీదర్



నరసరావుపేట టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీప కాంతులతో శోభాయమానంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే పండగ దీపావళి అని, పల్నాడు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీదర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని నిర్వహించుకుంటామన్నారు. దీపావళి స్ఫూర్తితో నయా నరకాసురులను ప్రజాస్వామ్య యుద్ధంలో ప్రజలందరూ ఓడించారన్నారు. ఈ నరకాసురులు మారీచుల్లాంటివారని, రూపాలు మార్చుకుంటూ తమను ఓడించారనే అక్కసుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, అశాంతి రేకెత్తించే కుట్రలకు దిగుతున్నారని అన్నారు. అందరూ అప్రమత్తంగా ఉండి ఇలాంటి నయా నరకాసురులకు, వారి అనుచరగణానికి ఎప్పటికప్పుడు గుణపాఠం చెప్పాలన్నారు. ఆడపడుచులు సత్యభామ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలన్నారు. ఈ వేడుకలలో టపాసులు కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, దీపావళిని పర్యావరణహితంగా చేసుకోవాలని ఆకాంక్షించారు.

నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే అరవిందబాబు...



నరసరావుపేట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధకారాన్ని తొలగించి వెలుగును నింపే దీపావళి పండుగ ప్రతి ఇంటిలో ఆనందాన్ని, సుఖశాంతులను నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ప్రేమ, అభివృద్ధి దీపాలు ప్రతి హృదయంలో వెలగాలన్నారు. ప్రజల ఆశీస్సులతో నరసరావుపేట మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు.

మహిళా కబడ్డీ పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు ప్రథమం


పోటీలలో విజయం సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

నరసరరావుపేట రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళా కబడ్డీ పోటీలు ఈనెల 16, 17 తేదీలలో లాంలోని చలపతి ఫార్మసీ కాలేజ్‌లో నిర్వహించారు. ఈ పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వర్గీయ కోడెల సంజీవయ్య పేరు మీద ఉన్న ఏఎన్‌యూ మహిళా కబడ్డీ రోలింగ్ ట్రోఫీని వరుసగా రెండవసారి కైవశం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ టోర్నమెంట్‌లో భాగంగా ఏఎన్‌యూ మహిళా కబడ్డీ జట్టును ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇందులో త్రివేణి, కావేరి, లక్ష్మీదేవి, కృష్ణశ్రీ ఎంపికయ్యారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఈదర ఆదిబాబు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు చెన్నైలో ఈనెల 29 నుండి జరగబోయే సౌత్ జోన్ మహిళా కబడ్డీ పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నాసరయ్య, వీరరాఘవులు, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, అకడమిక్ డైరెక్టర్ యోగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ సతీష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ ఈదర ఆదిబాబు, పీఈటీ మహమ్మద్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

లూథరన్ హైస్కూలు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 19(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని లూథరన్ హైస్కూలు పూర్వ విద్యార్థులు 1982 - 83 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నరసరావుపేటలో జరిగింది. నరసరావుపేట పట్టణంలో గ్రాండ్ సిటీ నందు పూర్వ విద్యార్థుల మూడో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా కొండా శోభారాణి, దేవరపల్లి సంధ్యా, జలసూత్రం అనురాధ జ్యోతి ప్రజ్వలన చేశారు. తదుపరి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు ఆనాటి తీపి గుర్తులు నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో బొందిలి శ్రీనివాస్ సింగ్, కుందా సురేష్, ఏసుదాసు, ఏడుకొండలు, పువ్వాడ వెంకటేశ్వర్లు, జి.వి.ఆర్.సురేష్, ఎం విజయకుమార్, లాల్, బాషా తదితరులు పాల్గొన్నారు

రేపు పాఠశాలల్లో వార్షిక వేడుకలు

నాదెండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో గల నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 17వ వార్షికోత్సవం, కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాలల 92వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం సాయంత్రం జరుగుతాయని హెచ్ఎం కిషోర్ ఆదివారం తెలిపారు. ఈ వేడుకల్లో జిల్లా విద్యా శాఖ అధికారి ఎల్ చంద్రకళ, డిప్యూటీ డీఈవో షేక్ మహబూబ్ సుభానీ, ఎంఈవో కృష్ణారెడ్డి, గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డిలు పాల్గొంటారని ఆయన వివరించారు.

దేశసేవకు ముందడుగు

● ఎన్‌సీసీలో చేరేందుకు విద్యార్థుల ఆసక్తి
● పూర్తయిన క్యాడెట్ల ఎంపిక



ఎన్‌సీసీ ఎంపికలకు పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్మీ అధికారులు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఎన్‌సీసీలో చేరి దేశ సేవచేసేందుకు విద్యార్థులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. ఎన్‌సీసీలో చేరి శిక్షణ పొందితే విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చేరిన విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు పోటీ పడుతున్నారు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల శంకరభారతి పురం హైస్కూల్లో ఇటీవల నిర్వహించిన ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక ప్రక్రియలో 53 మంది విద్యార్థులు ఎన్‌సీసీకి ఎంపికయ్యారు. వారిలో 32 మంది బాలురు, 21 మంది బాలికలు ఉన్నారు. ఎన్‌సీసీలో చేరితే క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం, సమయస్ఫూర్తి అలవడుతాయి. దీనికి తోడు పోలీసుశాఖ, దేశ రక్షణశాఖలో చేరితే అక్కడ శిక్షణ తీసుకోవడం సులువవుతుంది. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులు వారి అభిప్రాయాలు పంచుకున్నారు.

క్రమ శిక్షణ అలవర్చుకోవచ్చు

- చింతా హర్ష, 8వ తరగతి, శంకర భారతీ హైస్కూలు, నరసరావుపేట

ఎన్‌సీసీలో చేరి శిక్షణ తీసుకుంటే క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం అలవడుతాయి. అందుకే ఎన్‌సీసీలో చేరాను. పాఠశాలలో సీనియర్లు చేస్తున్న మాక్‌డ్రిల్ చూసి ఆసక్తి పెరిగింది. పోలీస్‌శాఖలో చేరాలనే ఆసక్తి ఉంది.

సేవాభావం అలవడుతుంది

- జి.వెంకట దుర్గా ప్రసాద్, 8వ తరగతి

ఎన్‌సీసీలో చేరడంతో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం అలవడుతుంది. సేవాభావంతో ఏదో విధంగా దేశానికి సేవచేయాలన్నదే లక్ష్యం. భవిష్యత్తులో ఆర్మీలో చేరాలని ఎన్‌సీసీ ద్వారా సాధన చేయాలని అనుకుంటున్నాను.

దేశ రక్షణలో పాలుపంచుకుంటా

- జె.కార్తీక్, 8వ తరగతి

ఎన్‌సీసీలో తీసుకునే శిక్షణ పోలీసు, ఆర్మీ ఉద్యోగాలలో చేరేందుకు ఉపయోగపడుతుందని అందరూ చెబుతున్నారు. ఎన్‌సీసీలో శిక్షణ పూర్తి చేసుకుని ఆర్మీలో చేరి దేశ రక్షణలో పాలుపంచుకుంటాను. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఈ దిశగా సాధన చేస్తున్నాను.

ఆర్మీలో చేరడమే లక్ష్యం

- తేజశ్విని, 8వ తరగతి

చిన్నప్పటి నుంచి ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలనే ఆకాంక్ష. హైస్కూలులో చేరగానే ఎన్‌సీసీలో చేరాలని నిర్ణయించుకున్నాను. ఎంపిక ప్రక్రియకు హాజరయ్యారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకుని ఆర్మీలో చేరి దేశానికి సేవచేయడంతోపాటు నా కలను సాకారం చేసుకుంటాను.



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులతో ఆర్మీ అధికారులు

క్రమ శిక్షణ, సేవాభావం కలుగుతుంది

- ఎస్‌కె శ్రీలక్ష్మీ, 8వ తరగతి

ఎన్‌సీసీలో చేరడం ద్వారా క్రమశిక్షణ, సేవాభావం కలుగుతుంది. భవిష్యత్తులో పోలీసు అధికారి అవ్వాలన్నదే నా లక్ష్యం.

సీనియర్లు చేస్తున్న మాక్‌డ్రిల్ ఆకట్టుకుంది

- కె. ప్రవీణ, 8వ తరగతి, నరసరావుపేట

మా శంకర భారతి హైస్కూలులో సీనియర్లు చేస్తున్న మాక్‌డ్రిల్, శిక్షణ ఆకట్టుకుంది. ఎన్‌సీసీలో శిక్షణ పొంది దేశ సేవ చేయాలని నిర్ణయించుకున్నాను.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా తదితరులు

వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం 130వ దసరా నవరాత్రుల కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, వనమా సాంబశివారావు, ఆయల పెద్దలు పాల్గొన్నారు.

జన్నాభట్లకు నివాళులు



సంతాపం తెలియజేస్తున్న నిర్వాహకులు

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన పట్టణానికి చెందిన సంస్కృతాంధ్ర పండితుడు, పౌరాణిక నటుడు జన్నాభట్ల లక్ష్మీనారాయణకు ఆదివారం నరసరావుపేట కళావేదిక ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. తొలుత లక్ష్మీనారాయణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు నాటక రంగంలో ఆయన సేవలను కొనియాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎంతోమంది పేద, వృద్ధ కళాకారులకు ప్రభుత్వం నుంచి పెన్షన్ మంజూరు చేయించిన ఘనత జన్నాభట్లదని ప్రశంసించారు. ఆయన మృతి కళారంగానికి తీవ్రలోటని తెలిపారు. సంతాపం తెలియజేసిన వారిలో నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, అయినవోలు సాంబశివరావు, రత్నాకరం రాము, బీవీ.చంద్రశేఖర్, యన్న నర్శిరెడ్డి, వీవీఎస్ఆర్కే. ప్రసాదరావు, గంధం యాజ్ఞవల్క్య శర్మ, బత్తుల మురళి, ఈవూరి వెంకటరెడ్డి, షేక్.మాబు, అమరేంద్ర, గుబ్బా రమేశ్, సలాం, సింగరయ్య చౌదరి, వైఆర్ఎంజి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్వర్ణ చిన రామిరెడ్డి నిర్వహించారు.

ప్రజలంతా స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించాలి

● బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు



సమావేశంలో పాల్గొన్న కూటమి నాయకులు

కారుమంచి (శావల్యాపురం) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక స్వావలంబనను సాధించేందుకు ప్రజలంతా స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించాలని బీజేపీ మండలాధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు అన్నారు. భారతదేశ ఆర్థిక ప్రగతికి తమ వంతు సహకారమందించాలని కోరారు. సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కారుమంచిలో ఆదివారం మండల కార్యశాలను నిర్వహించారు. ప్రోగ్రాం ఇన్‌చార్జి మేడం రమేశ్ మాట్లాడుతూ, భారత ఆర్థికవ్యవస్థ బలోపేతానికి బీజేపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ప్రజలంతా విదేశీ ఉత్పత్తులను వ్యతిరేకించి స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రోగ్రాం ఇన్‌చార్జి అన్నవరపు శ్రీనివాసరావు, కో-కన్వీనర్ పత్తి మణికంఠ, కూటమి నేతలు యరమాసు కోటేశ్వరరావు, గోపాళం శివప్రసాద్, కోటా హరిబాబు, సోమేపల్లి ఉమామహేశ్వరరావు, నాదెల నరసింహారావు, వీరేంద్ర పాల్గొన్నారు.



దీపావళి సందర్భంగా పీజీఆర్ఎస్ రద్దు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం దీపావళి పర్వదినం సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ బీ కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

పల్నాడు జిల్లా వైసీపీ మీడియా ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జునరెడ్డి

రొంపిచర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామానికి చెందిన గెల్లి మల్లికార్జునరెడ్డి పల్నాడు జిల్లా వైసీపీ విభాగం మీడియా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు అందాయి. మండలంలో వైసీపీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మల్లికార్జునరెడ్డి తెలిపారు. తన నియామకానికి సహాయ సహకారాలు అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో

ఘనంగా ఘుంకార్ దీపావళి ఉత్సవ్ 2025



దీపావళి వేడుకల్లో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా ఘుంకార్ దీపావళి ఉత్సవ్ 2025 నిర్వహించినట్లు స్కూల్ చైర్మన్‌డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు మాట్లాడుతూ, తమ విద్యార్థులు రంగస్థలాన్ని స్ఫూర్తిదాయకంగా మార్చి తమ ప్రతిభ, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను అద్భుతంగా ప్రదర్శించారన్నారు. దీపాలు, సంగీతం, డ్యాన్స్, దాండియా, స్నేహభావంతో కూడిన ఈ ఉత్సవం విద్యార్థుల అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో విద్యతో పాటు సంస్కృతిని మేళవిస్తూ, ఆనందం, ఐక్యత పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఈ దీపావళి ఉత్సవం విజయవంతంగా జరుపుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ నాగోతు సబిత, ప్రిన్సిపాల్ రేఖా ఫులేకర్ హాజరై, విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



సామూహిక ధ్యానంతో మహత్తర శక్తి

● కూనిశెట్టి జనార్ధనరావు



సామూహిక ధ్యానం చేసిన యోగ సాధకులతో కూనిశెట్టి వెంకట జనార్ధనరావు, కన్వీనర్ కూనిశెట్టి అనురాధ తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సామూహిక ధ్యానంతో మహత్తర శక్తి లభిస్తుందని శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ నిర్వహకులు కూనిశెట్టి వెంకట జనార్ధనరావు అన్నారు. ఆదివారం పట్టాభి రామస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న వెంకటేశ్వర కళ్యాణ మండపంలో సామూహిక ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా కూశిశెట్టి వెంకట జనార్ధనరావు మాట్లాడుతూ యోగ, ప్రాణాయమంతో పాటు ధాన్యం చేస్తే అద్భుత ఫలితాలు ఉంటాయన్నారు. యోగా సాధకులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో యోగ సాధకులు, మహిళలు పాల్గొన్నారు.

కొత్త జాతీయ రహదారితో పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టండి

● పోలీసులకు వినియోగదారుల ఫోరం విజ్ఞప్తి

చిలకలూరిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణం పక్కగా నూతనంగా నిర్మించిన 167ఏ పిడుగురాళ్ల ఓడరేవు జాతీయ రహదారిని పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఉపయోగించాలని పల్నాడు జిల్లా వినియోగదారుల హక్కుల రక్షణ ఫోరం నాయకులు ఆదివారం అర్బన్ పోలీసులను కోరారు. ఈ మేరకు వారు అర్బన్ సీఐ పీ రమేష్ కు ఒక వినతి పత్రాన్ని అందచేశారు. స్థానిక గడియారం స్తంభం సెంటర్ నుంచి కొద్ది దూరంలోనే ఈ రహదారి అందుబాటులోకి వచ్చినందున రాకపోకలను మళ్లించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి అందివచ్చిన అవకాశాలను సత్వరం పరిశీలించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మార్గంలోకి వాహనాలను మళ్లిస్తే కొంతమేరకు ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని వారు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఫోరం జిల్లా అధ్యక్షులు మురికిపూడి ప్రసాద్, కార్యదర్శి రవి నాయక్, కోశాధికారి బేబీ విక్రమ్, సహాయ కార్యదర్శి గాలయ్య ఉన్నారు.



విప్పర్ల శివాలయంలో కార్తీకమాస పూజలు

రొంపిచర్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్ల గ్రామంలో వేంచేసి ఉన్న వల్లభేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి కార్తీక మాస పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం పేర్కొంది. ఈ సందర్భంగా ప్రతి సోమవారం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 5వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపోత్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు స్వామి వారి పూజల్లో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు చెకుముకి పోటీలు



ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తున్న ఎంఈవో జప్రుల్లా

వినుకొండటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ జనవిజ్ఞాన వేదిక వినుకొండ శాఖ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు ఆదివారం నిర్వహించారు. వినుకొండ నియోజకవర్గంలోని 5 మండలాల్లో సుమారు 30 పాఠశాలలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో సయ్యద్ జప్రుల్లా ప్రశ్నపత్రాన్ని విడుదల చేశారు. విద్యార్థులలో విజ్ఞానం పెంపొందించడానికి, సామాజిక చైతన్యం కలిగించడానికి ఈ ప్రతిభా పరీక్షలు దోహదపడతాయని ఎంఈవో అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ, వేదిక అధ్యక్షులు కమలారామ్, కార్యదర్శి బి రవికుమార్ పాల్గొన్నారు.

అద్దెకిచ్చిన బిల్డింగ్ ఖాళీ చేయండి మహోప్రభో..

నరసరావుపేట రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుకు భవనం అద్దెకు ఇచ్చిన యోగిరెడ్డి ఖాళీ చేయాలని వేడుకొంటున్నాడు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోగల గ్రామీణ బ్యాంకు ఏర్పాటుకోసం గ్రామానికి చెందిన యోగిరెడ్డి అక్టోబరు 2021 నుండి 2023 వరకు భవనం అద్దెకు ఇచ్చాడు. 2023 నాటికి అగ్రిమెంటు సమయం పూర్తి కావడంతో మరో సంవత్సరం పొడిగించాలని బ్యాంకు అధికారులు కోరడంతో మరో ఏడాది పొడిగించారు. అనంతరం గడువు ముగిసినా ఖాళీ చేయకపోవడం.. గత ఆరు నెలలుగా అద్దె చెల్లించక పోవడంతో విసుగు చెందిన యజమాని భవనం వెంటనే ఖాళీ చేయాలని శనివారం బ్యాంకు ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటుచేసి నిరసన వ్యక్తం చేస్తున్నారు.



నరసరావుపేటలో బిల్డింగ్ ఖాళీ చేయాలని ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఇంటి యజమాని



